సాక్షి
నాగర్‌కర్నూల్
శనివారం । 7 । అక్టోబర్ । 2023



మారుతున్న రూపురేఖలు
పీఏసీఎస్‌లు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి.
వివరాలు 8లో ▸



ఘనంగా ఆరుద్రోత్సవం
అలంపూర్ ఆలయాల్లో శుక్రవారం ఆరుద్రోత్సవం ఘనంగా నిర్వహించారు.
వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.2 /18.1
రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

కొల్లాపూర్‌కు పాలిటెక్నిక్ కళాశాల మంజూరు

కొల్లాపూర్: కొల్లాపూర్‌కు పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కరుణ వాకిటి ఈ మేరకు జీఓ ఎంఎస్ నంబర్ 78 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 16న కొల్లాపూర్‌లో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు సీఎం కేసీఆర్ పాలిటెక్నిక్ కళాశాల మంజూరుకు హామీ ఇచ్చారు. కళాశాల మంజూరుకు అవసరమైన ఉత్తర్వులు విడుదల చేయాలని ఇటీవల సీఎం కార్యాలయం నుంచి ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో కళాశాలను మంజూరు చేస్తూ.. ఉన్నత విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పాలిటెక్నిక్ కళాశాల మంజూరు పై ఎమ్మెల్యేతో పాటు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. విద్యారంగంలో కొల్లాపూర్‌లో అభివృద్ధి చెందేందుకు ఇది దోహదపడుతుందన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి కృషి



బిజినేపల్లి: గిరిజన తండాలకు గత పాలకుల కాలంలో మట్టి రోడ్లపై ప్రయాణించే వారిని, కేసీఆర్ ప్రభుత్వం హయాంలో నేడు తండాలకు అంబులెన్స్‌లు కూడా నిమిషాల్లో వస్తున్నాయని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పదేళ్ల ప్రజా ప్రస్థానంలో మర్రి యాత్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆయా గిరిజన తండాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడారు. గిరిజన తండాలకు ఆసరా, కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు అందుతున్నాయని, వారి కోసం మరిన్ని పథకాలు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్ రెడ్డి, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత ఉపకరణాలు పంపిణీ

కందనూలు: సమగ్ర శిక్ష తెలంగాణ, భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జెడ్పీ చైర్‌పర్సన్ శాంతాకుమారి చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా 152 మంది దివ్యాంగ విద్యార్థులకు దాదాపు రూ.కోటి విలువ చేసే 224 ఉచిత ఉపకరణాల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన, జిల్లా సెక్రెటరీ వెంకటయ్య, భాస్కర్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, ప్రసాద్ గౌడ్, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి వలసలు



ఢిల్లీలో పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న కల్వకుర్తి నేతలు

- బీఆర్‌ఎస్‌ను వీడిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఆయన వెంటే జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్
- కల్వకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌లోకి వంద మంది బీఆర్‌ఎస్ నేతలు

సాక్షి, నాగర్‌కర్నూల్: కాంగ్రెస్ పార్టీలోకి నేతల వలసలు జోరందుకున్నాయి. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న పలువురు నేతలు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి చేరుతుండటం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తనయుడు రాజేశ్‌రెడ్డి ఇప్పటికే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరగా, తాజాగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సైతం శుక్రవారం కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ ఠాకూర్‌తో పాటు మరో వంద మంది వరకు కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ నేతలతో కలిసి ఆయన ఢిల్లీలోని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అధికార బీఆర్‌ఎస్ నుంచి పెద్దసంఖ్యలో నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరుతుండటం, ఎన్నికల వేళ ఈ పరిణామాలు ఎలాంటి పరిణామాలు చూపుతాయోనన్నది సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తీరు నచ్చకనే..

బీఆర్‌ఎస్‌లో సుదీర్ఘకాలం పాటు పనిచేస్తున్నా తమకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తగిన గుర్తింపు ఇవ్వడం లేదని, ఆయన పనితీరు నచ్చకనే పార్టీ వీడాల్సి వచ్చిందని జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ చెబుతున్నారు. తన వర్గీయులపై ఎమ్మెల్యే కక్షసాధింపు చర్యలు చేపట్టారని, వారిపై కేసులు పెడుతూ, అన్ని సంక్షేమ పథకాలకు దూరంగా ఉంచుతున్నారని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పలుమార్లు ఎమ్మెల్యేపై వ్యాఖ్యలు చేశారు. బీఆర్‌ఎస్ అధిష్టానం మళ్లీ సిట్టింగ్ ఎమ్మెల్యేలనే అభ్యర్థులుగా ప్రకటించడంతో ఎమ్మెల్యే వ్యతిరేకులనంతా ఏకం చేసినట్టు తెలుస్తోంది. నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నేతలు పెద్దసంఖ్యలో పార్టీని వీడుతుండటంతో ఆ పార్టీశ్రేణుల్లో ఆందోళన నెలకొంది. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుందన్న ఊహాగానాల నేపథ్యంలో మున్ముందు ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయన్నది సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

నేతల చేరికతో నూతనోత్సాహం..

అసెంబ్లీ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న కొద్దీ పార్టీల్లోకి నేతల వలసల జోరు పెరుగుతోంది. జిల్లాలోని అధికార బీఆర్‌ఎస్ నుంచి పలువురు సీనియర్ నేతలు ఒక్కొక్కరిగా కాంగ్రెస్‌లోకి చేరుతుండటం ఆసక్తికరంగా మారింది. గురువారం అచ్చంపేట నియోజకవర్గంలోని అచ్చంపేట, ఉప్పునుంతల జెడ్పీటీసీలు మంత్రియ నాయక్, అనంత ప్రతాప్‌రెడ్డి, ఉప్పునుంతల ఎంపీపీ అరుణ, అచ్చంపేట వైస్‌ఎంపీపీ అమరావతి, మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ సీఎంరెడ్డి తదితర నేతలు కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా శుక్రవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆయన ముఖ్య అనుచరులతో కలిసి కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ కోసం 18 ఏళ్లుగా పనిచేసిన సీనియర్ నాయకుడు, జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ సైతం ఎమ్మెల్సీ కసిరెడ్డి వెంట నడిచి కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. కల్వకుర్తి మున్సిపాలిటీలోని 9 మంది కౌన్సిలర్లు, ఆమనగల్లు, కడ్తాల్ ఎంపీపీలు కమ్లి మోతెనాయక్, అనిత సైతం కాంగ్రెస్‌లో చేరారు. కల్వకుర్తి మున్సిపాలిటీలోని కౌన్సిలర్లు ఆనంద్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, హన్మానాయక్, అజర్, శ్రీను, బాలునాయక్, సతీశ్, మాజీ సర్పంచ్‌లు సుదర్శన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ సంజీవ్ యాదవ్, చారకొండ వైస్‌ఎంపీపీ వెంకటయ్య యాదవ్, జంగయ్యయాదవ్, మాడ్గుల్ బీఆర్‌ఎస్ నేతలు కొండల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమేశ్‌యాదవ్, కృష్ణ తదితర నేతలు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు.

అల్పాహార పథకం పేద పిల్లలకు వరం



విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకుంటున్న జెడ్పీ చైర్మన్ శాంతకుమారి, కలెక్టర్ పి.ఉదయ్ కుమార్

- జెడ్పీ చైర్‌పర్సన్ శాంత కుమారి

నాగర్‌కర్నూల్: అల్పాహార పథకం పేద పిల్లలకు వరమని జెడ్పీ చైర్‌పర్సన్ శాంత కుమారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సంజయ్ నగర్ ప్రాథమిక పాఠశాలలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శాంతకుమారి, కలెక్టర్ పి.ఉదయ్ కుమార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ కల్పన భాస్కర్ గౌడ్ సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఏ పథకం ప్రారంభించినా దాని వెనక ఓ మానవీయ కోణం ఉందన్నారు. విద్యార్థుల కోసం అనేక కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు రోజుకో పౌష్టికాహారం అందించనున్నట్లు చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యమే ముఖ్యమన్నారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మరింతగా పెరుగుతుందన్నారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఇడ్లీ, ఉప్మా, స్వీట్ కేసరి, పల్లి చట్నీ, సాంబార్, టమాటా చట్నీతో అల్పాహారాన్ని స్వీకరించారు. అనంతరం కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ మాట్లాడారు. ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. 'మన ఊరు– మన బడి' ద్వారా మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని, ఇదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ ఉదయం అరగంట ముందుగానే పాఠశాలకు హాజరుకావాలని, తల్లిదండ్రులు కూడా ఈ మార్పులను గమనించి సూచించారు. అల్పాహార పథకం దసరా సెలవుల అనంతరం పూర్తిస్థాయిలో అందుతుందన్నారు. అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, గోవిందరాజులు, కల్పన భాస్కర్‌గౌడ్, పాల్గొన్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థ బలోపేతం

కల్వకుర్తి రూరల్: ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రభుత్వం పటిష్టం చేసిందని ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులను, ఇతర ఆహార సంబంధమైన ప్రజా పంపిణీ వ్యవస్థలను పటిష్టంగా అమలు పరిచేందుకు నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. ఆహార భద్రత చట్టం 2013 ప్రకారం సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం, ప్రసూతి ప్రయోజనాలు, ఆహార పౌర సంబంధాలు తదితర శాఖల నుంచి ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తామన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా సమస్యల పరిష్కారం కోరుతూ వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారని, వారి సమస్యలు పరిష్కారం కోరుతూ శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వారి సమస్యలు పట్టించుకొని చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆశలతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

• ఇంకా సస్పెన్స్

బరి.. కుదరని గురి!

కాంగ్రెస్, బీజేపీలో ఖరారు కాని అభ్యర్థిత్వాలు



- ఆయా పార్టీల్లోని టికెట్ ఆశావహులు, శ్రేణుల్లో ఉత్కంఠ
- ఢిల్లీ చుట్టూ నేతల ప్రదక్షిణలు.. గాడ్‌ఫాదర్లతో లాబీయింగ్
- ముందస్తుగా జాబితా వెల్లడితో బీఆర్‌ఎస్‌లో జోష్
- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజాక్షేత్రంలోనే నేతలు
- ఊరూరా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల జాతర
- కోడ్ కూసేలోగా అన్ని మండలాలు చుట్టేసేలా కార్యాచరణ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. అధికార బీఆర్‌ఎస్‌లో ముందస్తుగానే అభ్యర్థిత్వాలు ఖరారు కాగా.. ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఆగస్టు 21న జాబితా వెల్లడించిన విషయం తెలిసిందే. ఉమ్మడి జిల్లాలోని 14 స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలే మళ్లీ బరిలో నిలవనున్నారు. వీరిని దీటుగా ఎదుర్కొనే సామర్థ్యమున్న అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ ఇంకా జల్లెడపడుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో ఆయా పార్టీల్లో టికెట్ ఆశిస్తున్న పలు నియోజకవర్గాల నేతలు హైదరాబాద్, ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా.. అభ్యర్థిత్వాల ఖరారులో జరుగుతున్న జాప్యం వారిని ఉత్కంఠకు గురి చేస్తోంది. మరోవైపు ఒక్కో నియోజకవర్గం నుంచి ఇద్దరు, ముగ్గురు, నలుగురికి పైగా పోటీపడుతుండడం.. ఎవరికి వారు తామే అభ్యర్థులమని.. తమకే సీటు వస్తుందని ఆశావహులు ప్రచారం చేసుకుంటుండడంతో ఆయా పార్టీల్లోని ద్వితీయ శ్రేణి నాయకులు, శ్రేణులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నాయి.

కాంగ్రెస్..వారంలో జాబితా

ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. జిల్లాల విభజన క్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గం పూర్తిగా రంగారెడ్డి జిల్లాలోకి వెళ్లింది. ఇది మినహాయించి 13 సెగ్మెంట్లలో (మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, నారాయణపేట, మక్తల్, కొడంగల్, వనపర్తి, గద్వాల, అలంపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్) 73 మంది ఆశావహులు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో కొడంగల్ నుంచి ఒకే ఒక్కడు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, అలంపూర్ నుంచి ఇద్దరు కాగా.. మిగతా నియోజకవర్గాల్లో ముగ్గురి నుంచి పది మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. వీరే కాకుండా మారిన రాజకీయ పరిణామాల క్రమంలో టికెట్ ఆశించి ఒకరిద్దరు ముఖ్య నేతలు కాంగ్రెస్‌లో చేరారు. అభ్యర్థుల ఆర్థిక స్తోమత, సామాజికసేవలు, స్థానిక రాజకీయ పరిస్థితులు, పలు సర్వేల ఆధారంగా ఢిల్లీ వేదికగా పార్టీ స్క్రీనింగ్ కమిటీ వడపోత పూర్తి చేసినట్లు తెలుస్తోంది. అయితే పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియాగాంధీ ఫైనల్ చేసిన తర్వాతే బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను వెల్లడించనున్నట్లు సమాచారం. నారాయణపేట, మక్తల్ మినహా మిగతా అన్ని నియోజకవర్గాల అభ్యర్థులను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. వీరి జాబితాను వారం రోజుల్లో ప్రకటించే అవకాశం ఉంది. నారాయణపేటలో ఎర్రశేఖర్, కుంభం శివకుమార్‌రెడ్డి పేర్లు పరిశీలనలో ఉండగా.. ఇక్కడ అభ్యర్థిని ఖరారు చేసే దాన్ని బట్టి మక్తల్‌లో అభ్యర్థిని ఎంపిక చేయనున్నట్లు సమాచారం. మక్తల్‌లో వాకిటి శ్రీహరి, నాగరాజు గౌడ్, కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నాయి.

బీజేపీ.. తొలి జాబితాలో నలుగురే

వచ్చే ఎన్నికల్లో సత్తా చాటుతామని ధీమాగా ఉన్న బీజేపీ పాలమూరు వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా శంఖారావాన్ని పూరించింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య భారీగానే ఉంది. పార్టీ చరిత్రలో తొలిసారిగా ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించగా.. పెద్దమొత్తంలో వచ్చాయి. కానీ క్షేత్రస్థాయిలో నాలుగైదు స్థానాల్లో తప్ప మిగతా నియోజకవర్గాల్లో అభ్యర్థుల బలాబలాలు పరిశీలిస్తే అంతంతమాత్రంగానే ఉన్నట్లు గ్రహించిన అధిష్టానం పూర్తిస్థాయిలో జల్లెడ పడుతున్నట్లు తెలుస్తోంది. వారంలోపు రాష్ట్ర వ్యాప్తంగా తొలి జాబితా విడుదల చేసేలా బీజేపీ ముఖ్య నేతలు ముందుకు సాగుతుండగా.. ఇందులో ఉమ్మడి జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేసే అభ్యర్థుల పేర్లు ఉండనున్నట్లు సమాచారం. కల్వకుర్తి ఆచారి, గద్వాల డీకే అరుణ, దేవరకద్ర డోకూరు పవన్‌కుమార్, కొల్లాపూర్ సుధాకర్ రావు పేర్లు ఖరారైనట్లు తెలుస్తోంది.

హస్తం, కమలం ఆశావహుల్లో ఆందోళన..

కాంగ్రెస్, బీజేపీలో అసెంబ్లీ అభ్యర్థిత్వాల ఖరారులో జాప్యం జరుగుతుండడంతో ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. కష్టకాలంలో పార్టీ వెన్నంటి ఉండి..అహర్నిశలు శ్రమించామని.. పెద్ద మొత్తంలో ఖర్చులు భరించామని.. ఇప్పుడు టికెట్ కోసం నిరీక్షించాల్సి రావడం నిద్ర లేకుండా చేస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టికెట్ల ఖరారుతో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ప్రతి రోజు జాతరలా ఊరూరా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తుండడం.. కోడ్ కూసేలోపు అన్ని మండలాలు, గ్రామాలను చుట్టేసేలా ప్రత్యేక కార్యచరణతో ముందుకు సాగుతుండడం కాంగ్రెస్, బీజేపీ ఆశావహులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నట్లు తెలుస్తోంది.

'అభయహస్తం' అందేనా?

నిధుల కోసం మహిళల ఎదురుచూపులు

- 2009లో పథకం ప్రారంభం
- నగదు తిరిగిస్తామని వివరాలు సేకరించి ఏడాదిన్నర..
- జిల్లాలో 57,110 మంది..



ఏడాదిన్నర అయినా..

అభయహస్తం పథకానికి నగదు చెల్లించిన మహిళలకు తిరిగి నిధులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడంతో మహిళలు హర్షం వ్యక్తం చేశారు. అయితే ఏడాదిన్నర దాటినా నేటికీ తిరిగి చెల్లించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. తాము చెల్లించిన డబ్బులను తిరిగి వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

అచ్చంపేట: స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉంటూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల కోసం మహిళలు అభయహస్తం పథకానికి డబ్బులు చెల్లించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసి మహిళా సభ్యుల పిల్లల చదువుకు ఉపకార వేతనాలు, వృద్ధాప్యంలో పింఛన్‌తో పాటు ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేసేవారు. తక్షణ సాయంగా అంత్యక్రియలకు రూ.5 వేలు ఇచ్చేవారు.

రాష్ట్రం ఏర్పడిన తర్వాత..

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడటం, తెలంగాణలో కొత్త ప్రభుత్వ పాలన ప్రారంభమైన తర్వాత ఈ పథకాన్ని నిలిపివేసింది. అయితే ఇప్పటి వరకు అభయ హస్తం కింద నగదు చెల్లించిన మహిళలు తాము చెల్లించిన నగదును తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వచ్చారు. దీంతో గతేడాది ఫిబ్రవరిలో అభయహస్తం కింద నగదు చెల్లించిన మహిళలను గుర్తించి వారికి నగదు తిరిగి చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు అభయ హస్తం లబ్ధిదారుల పేర్లు, ఆధార్, బ్యాంకు ఖాతానంబర్లు, ఫోన్ నంబర్లు తదితర వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జిల్లాలో అభయహస్తం పథకం కింద 57,110 మంది మహిళలు నగదు చెల్లించారు.

60 ఏళ్లలోపు మహిళలు అర్హులు..

పొదుపు సంఘాల్లోని సభ్యులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు 2009లో అప్పటి సీఎం డా.వైఎస్ రాజశేఖర రెడ్డి అభయ హస్తం పథకాన్ని తీసుకొచ్చారు. 60 ఏళ్లలోపు మహిళలను అర్హులుగా గుర్తించి మహిళా సభ్యులు ఏటా రూ.365, ప్రభుత్వం రూ.360 జమ చేసేది. 60 ఏళ్ల నిండిన తర్వాత నెలకు రూ.500 పింఛన్ మంజూరు చేసేది. పథకంలో ఉండే సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.75 వేల పరిహారం, సహజ మరణమైతే రూ.30 వేలు, అంత్యక్రియలకు రూ.5 వేల చొప్పున నామినీలకు ఇవ్వడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. సభ్యుల పిల్లలకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు రూ.1,200 స్కాలర్‌షిప్ కూడా ఇచ్చేది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడం, ప్రభుత్వం మారడం, రాష్ట్రంలో వృద్ధాప్య పింఛన్ రూ.2,016కు పెంచడంతో ఈ పథకం 2016–17 నుంచి నిలిపివేసి పథకాన్ని రద్దు చేశారు.

ఐదేళ్లపాటు చెల్లింపు..

జిల్లాలో రూ.365 చొప్పున చెల్లించిన సభ్యులు 57,110 మంది ఉన్నారు. వీరు సుమారుగా అయిదేళ్ల పాటు తమ వాటా డబ్బులు చెల్లించారు. గతంలో అభయహస్తం కింద కాంట్రిబ్యూటరీ పింఛన్ కోసం 3,661 మంది రూ.3,650 చొప్పున చెల్లించారు. వీరికి ఒక్కొక్కరికి రూ.500 పింఛన్ అందించారు.

డబ్బులు తిరిగి ఇవ్వాలి..



2009 నుంచి ప్రతినెల డబ్బులు జమ చేశాం. గతేడాది అధికారులు బ్యాంకు అకౌంట్, ఫోన్ నంబర్ తీసుకున్నారు. ప్రభుత్వం మా డబ్బులు మాకు తిరిగి ఇవ్వాలి.

– చెట్టుకింద రాములమ్మ, మాధవానిపల్లి, అమ్రాబాద్

నాలుగేళ్లు చెల్లించాం..



ఏడాదికి రూ.365 చొప్పున 2008 నుంచి నాలుగేళ్లు చెల్లించాం. ఇప్పటి వరకు మాకు ఎలాంటి బెనిఫిట్స్ రాలేదు. మేము కట్టిన డబ్బులు వాపస్ ఇస్తామని చెబుతున్నారే తప్పా ఇంతవరకు ఇవ్వలేదు.

– కమ్మరి జ్యోతి, ఉప్పునుంతల

ఆన్‌లైన్‌లో నమోదు చేశాం..



ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో అభయహస్తం పథకంలో సభ్యులు చెల్లించిన నగదు, వారి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. మహిళల బ్యాంకు ఖాతా నంబరు, ఫోన్ నంబరు వివరాలు కూడా గతేడాది సేకరించాం. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే మహిళల ఖాతాల్లో నేరుగా నమోదవుతాయి.

– నర్సింగ్‌రావు, డీఆర్‌డీఓ

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి



మాట్లాడుతున్న ఎస్పీ మనోహర్

నాగర్‌కర్నూల్ క్రైం: రాబోయే ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా నిర్వహించేలా పోలీసు సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో రాబోయే ఎన్నికలకు సంబంధించి పోలీసు సిబ్బందికి సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. డబ్బు, మద్యం అక్రమ రవాణా జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేయాలన్నారు. ఎస్పీ మనోహర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటంలో జిల్లా ముందంజలో ఉండాలని, 2018 ఎన్నికల్లో నేర చరిత్ర ఉన్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్, డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ..

నాగర్‌కర్నూల్: నూతన జిల్లా సమీకృత కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి శుక్రవారం క్వార్టర్లీ తనిఖీల్లో భాగంగా శుక్రవారం తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. గోదాం వద్ద ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం లోపల భద్రపరిచిన మొదటి స్థాయి తనిఖీ పూర్తి చేసి ఉంచిన ఈవీఎం యంత్రాలతో పాటు గదుల్లోని వి.వి.ప్యాట్స్ ఇతర ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వస్తు సామగ్రిని, భద్రత చర్యలను పరిశీలించారు. ఈవీఎంలను భద్రపరిచిన తీరుపై సంతృప్తి వ్యక్తం చేసి పర్యవేక్షణ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. చుట్టుపక్కల అనుమతి లేని, అపరిచితులను ఎవరిని అనుమతించొద్దని, భద్రత సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల తహసీల్దార్ జాకీర్ అలీ, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ రఘు, నాయకులు ఎండి హుస్సేన్, బాలకృష్ణ, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్‌ క్రైం: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ శివారులో చోటు చేసుకోగా శుక్రవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ మహేందర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లవెల్లికి చెందిన బంగారయ్య (42) తన భార్యతో పది రోజుల క్రితం గొడవ కావడంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. మనస్తాపానికి గురైన బంగారయ్య ఉయ్యాలవాడ శివారులో గురువారం రాత్రి పురుగుల మందు తాగి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

పెద్దకొత్తపల్లి: చెన్నపురావుపల్లికి చెందిన పంగిడి చెరువు జాముడు(55) ఈ నెల 3న ఇంటి నుంచి తప్పిపోయాడు. ఆరో తేదీన పుట్టబాలయ్య పొలం వద్ద గుంతలో శవమై కనిపించాడు. మృతుని భార్య దేవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు హెడ్‌కానిస్టేబుల్‌ మల్లేష్‌ తెలిపారు. ఇంటి నుంచి తప్పిపోయిన జాముడు భార్య దేవమ్మ ఈ నెల 5న తన భర్త తప్పిపోయాడని పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్‌ కేసు పెట్టింది. పోలీసులు ఈ కేసుపై దర్యాప్తు జరుపుతుండగా జాముడు శవమై కనిపించాడు. ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉందని హెడ్‌కానిస్టేబుల్‌ తెలియజేశారు.


రేకుల షెడ్డు దగ్ధం

మన్ననూర్‌: అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద జీవనోపాధి కోసం వేసుకున్న రేకుల షెడ్‌ హోటల్‌ శుక్రవారం రాత్రి దగ్ధమైంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. 20 ఏళ్ల కిందట ఎండీ మౌలానా చెక్‌పోస్టు సమీపంలో జీవనోపాధి కోసం రోడ్డు పక్కన హోటల్‌ ఏర్పాటు చేసుకున్నాడు. మూడేళ్ల కిందట మౌలానా మృతిచెందడంతో అతని భార్య ముగ్గురు కుమారులతో కలిసి అక్కడే ఉంటూ జీవనం సాగిస్తుంది. హోటల్‌ మూసి ఉంచి రెండు రోజుల కిందట హైదరాబాద్‌లోని బంధువుల వద్దకు వెళ్లారు. రాత్రి సుమారు 8 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా హోటల్‌ నుంచి మంటలు ఎగిసి పడ్డాయి. దీంతో హోటల్‌ సమీప వారు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ మంటలు అదుపులోకి రాలేదు. హోటల్‌లోని వస్తువులన్నీ పూర్తిగా కాలి బూడిదయ్యాయి.

చెరువులో పడి రైతు, 2 ఎద్దులు మృతి

గోపాల్‌పేట: ఎద్దులకు నీరు తాపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో రైతుతో పాటు రెండు ఎద్దులు మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని నాగపూర్‌ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. రేవల్లి ఎస్‌ఐ శివకుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. నాగపూర్‌కు చెందిన గొల్ల నర్సింహకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. కుమారులు వారికి ఉన్న పొలంలో వ్యవసాయం చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం గొల్ల నర్సింహ ఎద్దుల బండికి ముందు రెండు ఎద్దులు, వెనకాల రెండు ఎద్దులు కట్టుకుని గ్రామానికి ఆనుకుని ఉన్న చెరువులో నీరు తాపేందుకు తీసుకెళ్లాడు. ముందున్న ఎద్దులు చెరువు లోపలికి ఈదుకుంటూ వెళ్లాయి. వెనకాల ఉన్న ఎద్దులకు తాడు పెద్దగా కట్టి ఉండటంతో వాటి కాళ్లకు తాళ్లు చుట్టుకుని మునిగిపోసాగాయి. గమనించిన రైతు వాటిని కాపాడేందుకు చెరువులోకి దూకాడు. తాళ్లను విప్పే క్రమంలో రెండు ఎద్దులు, నర్సింహ మునిగిపోగా ముందున్న రెండు ఎద్దులు బండిని ఈడ్చుకుని బయటికి వచ్చాయి. చుట్టుపక్కలవారు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. గ్రామస్తుల సాయంతో మృతి చెందిన ఎద్దులను, నర్సింహ్మను బయటకు తీశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రైవేట్‌ బస్సు



ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను ప్రైవేట్‌ ట్రావెల్‌ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఇటిక్యాల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపిన వివరాలు ఇలా.. కర్నూల్‌ జిల్లా బేతంచెర్ల మండలంలోని గొర్లగుట్టకు చెందిన గిడ్డయ్య (35) అదే గ్రామానికి చెందిన శ్రీనుతో కలిసి గురువారం రాత్రి ట్రాక్టర్‌పై బండలను వేసుకొని ఎర్రవల్లి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున 44వ జాతీయ రహదారిపై మునుగాల శివారులోకి రాగానే కర్నూల్‌ నుంచి హైదరాబాద్‌ వైపు వెళ్తున్న ట్రావెల్‌ బస్సు అతివేగంతో వచ్చి వెనక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌ డ్రైవర్‌ గిడ్డయ్యతో పాటు శ్రీనుకు తీవ్ర గాయాలు కాగా బస్సులోని ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను కర్నూల్‌ తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ గిడ్డయ్య మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌ మల్లేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మారుతున్న పీఏసీఎస్‌ల రూపురేఖలు



నాగసాల వద్ద నిర్మించిన గోదాం

- నాబార్డు సహకారంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 45గోదాంల నిర్మాణం
- బాదేపల్లిలో సొంతంగా భూమిని అందించిన పీఏసీఎస్‌ చైర్మన్‌
- అందుబాటులోకి వచ్చిన 2,500మెట్రిక్‌ టన్నుల సామర్థ్యం గల గోదాం

జడ్చర్ల టౌన్‌: రైతుల ప్రయోజనం కోసం రూపొందించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల రూపురేఖలు మారుతున్నాయి. పంట రుణాలకే పరిమితం కాకుండా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో 77 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉండగా ఆర్థికాభివృద్ధి సాధించిన సంఘాలు వేళ్లపై లెక్కించవచ్చు. అయితే ఇటీవల నాబార్డు సహకారంతో అన్ని సంఘాలు బలోపేతం అయ్యేందుకు పాలకవర్గాలు కృషి చేస్తున్నాయి. అందులో భాగంగా నాబార్డు సహకారంతో 77 సంఘాల పరిధిలో గోదాంలు, దుకాణాల నిర్మాణం కోసం రూ.70కోట్లు మంజూరయ్యాయి. నాబార్డు ద్వారా స్టేట్‌ కో ఆపరేటివ్‌ అపెక్స్‌ బ్యాంక్‌కు నిధులు విడుదల కాగా జిల్లాలోని డీసీసీబీ ద్వారా వాటిని ఆయా సంఘాలకు కేటాయించారు. 45 గోడౌన్‌లు నిర్మాణం చేపట్టగా కొన్ని సంఘాలు దుకాణ సముదాయాలు నిర్మించుకున్నాయి. 12 సంఘాలు 2,500 మెట్రిక్‌ టన్నుల సామార్థ్యం కల మెగా గోదాంలు నిర్మాణం చేస్తున్నాయి. వాటిలో బాదేపల్లి, కొండనాగుల, పెబ్బేర్‌, కోస్గి, మహబూబ్‌నగర్‌, దేవరకద్ర, షాద్‌నగర్‌, నాగర్‌కర్నూలు, అచ్చంపేట 2, ఉప్పునుంతల, మిడ్జిల్‌ ఉన్నాయి. వీటిలో నాగర్‌కర్నూల్‌, అచ్చంపేట, ఉప్పునుంతల, మిడ్జిల్‌లో నిర్మాణంలో ఉండగా మిగిలిన 8 గోదాంలు పూర్తయ్యాయి. మిగిలిన 33లో కొన్ని 500మెట్రిక్‌ టన్నుల సామార్థ్యం, మరికొన్ని వెయ్యి, ఇంకొన్ని 1,500మెట్రిక్‌ టన్నుల సామర్థ్యం ఉన్నాయి.

నేడు ప్రారంభించనున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శనివారం ఉదయం 9గంటలకు పీఏసీఎస్‌ గోదాంను జడ్చర్లలో ప్రారంభించనున్నారు. వారితోపాటు డీసీఎంఎస్‌ చైర్మన్‌, డీసీసీబీ చైర్మన్‌, అధికారులు హాజరు కానున్నారు.

రైతుల ప్రయోజనాల కోసమే..



బాదేపల్లి సహకార సంఘంలో సభ్యులుగా ఉన్న 450మంది రైతుల ప్రయోజనం కోసం కృషి చేస్తున్నాం. అందులో భాగంగానే కార్యాలయం ఆధునీకరించేందుకు, గోదాం కోసం స్థలం ఇచ్చాను. 2,500 టన్నుల సామర్థ్యం గల గోదాం అందుబాటులోకి రావటం వల్ల ప్రతినెలా అద్దెరూపంలో ఆదాయం సమకూరుతుంది. **–పాలెం సుదర్శన్‌గౌడ్‌, చైర్మన్‌, పీఏసీఎస్‌ బాదేపల్లి**

బాదేపల్లిలో..

బాదేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. చైర్మన్‌గా ఉన్న పాలెం సుదర్శన్‌గౌడ్‌ రూ.20లక్షల సొంత నిధులతో కార్యాలయం మరమ్మతు చేయించి ఆధునీకరించారు. నాబార్డు సహకారంతో నాగసాల వద్ద రూ. 1.87కోట్లతో 2,500 మెట్రిక్‌ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాం నిర్మాణం చేశారు. ఇందుకు నాబార్డు రూ.1.47కోట్ల రుణం ఇవ్వగా మిగిలిన నిధులు డీసీసీబీ కేటాయించింది. అవసరమైన స్థలాన్ని చైర్మన్‌ సొంత నిధులతో సమకూర్చుకున్నారు. నాగసాలకు చెందిన రైతుల నుంచి అసైన్డ్‌ భూమి 6ఎకరాలు సేకరించి వారికి రూ.30లక్షలు నిధులు ఇచ్చారు.

హతమార్చి.. మూటకట్టి...

భర్తను హతమార్చిన భార్య, ప్రియుడు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మరికల్‌: వివాహేతర సంబంధానికి అడ్డుగా వస్తున్నాడని కట్టుకున్న భర్తనే ప్రియుడితో కలిసి హతమార్చి మృతదేహాన్ని దుప్పట్లో మూటకట్టి ముళ్లపొదల్లో పడేసిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి కథనం మేరకు.. దేవరకద్ర మండలం గూరకొండకు చెందిన గడుగు శ్రీనివాసులు (34)కు మక్తల్‌ మండలం దాసరిదొడ్డికి చెందిన మాధవి అలియాస్‌ హారతితో నాలుగు ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల కుమారుడు, ఏడాది కుమార్తె ఉన్నారు. మాధవికి గూరకొండకు చెందిన గడుగు యమన్న అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది. మాధవి పుట్టింటికి వెళ్లగా ఈ నెల 1న ఇంట్లో నుంచి ఆటోలో బయలుదేరిన శ్రీనివాసులు రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్‌ కూడా స్విచ్ఛాఫ్‌ రావడంతో 2వ తేదీన శ్రీనివాసులు సోదరుడు మరికల్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మూడురోజుల పాటు పోలీసులు గాలించినా ప్రయోజనం లేకపోయింది. చివరకు ఎవరిమీదైనా అనుమానం ఉందా అని కుటుంబ సభ్యులను ఆరా తీయగా అదే గ్రామానికి చెందిన యమన్న పేరు చెప్పారు. దీంతో అతడిని అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా నిజాన్ని బయట పెట్టాడు. ఈ నెల 1న ఇంట్లో నుంచి బయటకు వచ్చిన శ్రీనివాసులును గమనిస్తున్న యమన్న మరికల్‌లో శ్రీనివాసులును కలిశాడు. భూత్పూర్‌లో ప్రధాని మోదీ సభకు వెళ్దామని శ్రీనివాసులు చెప్పగా వద్దు దాసరిదొడ్డిలోని నీ భార్య దగ్గరకు వెళ్దామని చెప్పి తీసుకెళ్లాడు. అక్కడికి కూడా వెళ్లకుండా రాష్ట్ర సరిహద్దులోని దేవసుగూర్‌ సమీపంలో కృష్ణానది వద్దకు తీసుకెళ్లి అక్కడే శ్రీనివాసులును హతమార్చి దుప్పట్లో మూటకట్టి ముళ్లపొదల్లో పారేశాడు. నిందితుడు చెప్పిన విధంగా శుక్రవారం పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహం కుళ్లిపోయి ఉండటంతో పోస్టుమర్టం నిమిత్తం నారాయణపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని.. మాధవి సహకారంతోనే శ్రీనివాసులును యమన్న హత్య చేశాడని ఎస్‌ఐ వివరించారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



శ్రీనివాసులు (ఫైల్‌)

ఘనంగా ఆరుద్రోత్సవం



ఐపీఎస్‌ అధికారి కృష్ణ ఆదిత్యను ఆహ్వానిస్తున్న ఆలయ ఈఓ, చైర్మన్‌

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్‌ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల్లో శుక్రవారం ఆరోద్రత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో ముక్కోటి దేవతామూర్తులకు ప్రతీకమైన గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. గణపతికి విశేష అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. గర్భాలయంలో కొలువుదీరిన బాలబ్రహ్మేశ్వరుడికి నమక, చమకాలతో ఏకాదశ రుద్రాభిషేకాలు, 11 పర్యాయాలు అభిషేకాలు చేశారు. అన్నసూక్తంతో స్వామివారికి అన్నాభిషేకం, షడ్రోపేతమైన పదార్థాలతో మూల మూర్తికి నైవేద్యాలు సమర్పించారు. దశవిధ హారతులు సమర్పించి భక్తులకు తీర్థ, ప్రసాదాలు ఇచ్చారు.

ఆలయంలో చండీహోమాలు

జోగుళాంబ అమ్మవారి ఆలయంలో శుక్రవారం సామూహిక చండీహోమాలు నిర్వహించారు. వారోత్సవాలలో భాగంగా చండీహోమాలు, దర్బార్‌ సేవ, రథోత్సవం చేపట్టారు. అమ్మవారికి ప్రదోశ కాలంలో దశవిదహారతులు భక్తులను విశేషంగా అలరించాయి.



అన్నాభిషేకంలో బాలబ్రహ్మేశ్వరుడు

దేవీనవరాత్రి బ్రహ్మోత్సవాలకు రండి..

- ప్రముఖులకు ఆహ్వానపత్రికలు

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల్లో 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే దేవీ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు పలువురు ప్రముఖులకు దేవస్థానం వారు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఆలయ ఈఓ పురేందర్‌కుమార్‌, పాలకమండలి చైర్మన్‌ చిన్నకృష్ణయ్య, ముఖ్య అర్చకుడు ఆనంద్‌ శర్మ, సభ్యులు వెంకటేశ్వరరెడ్డి, వెంకటేష్‌, అడవప్ప, అంపయ్య తదితరులు కలిసి ఆహ్వానించారు. మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌ గౌడ్‌, దేవదాయశాఖ కమిషనర్‌ అనిల్‌కుమార్‌, పొల్యూషన్‌ బోర్డు అధికారి కృష్ణ ఆదిత్య, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అలియాస్‌ గాయిత్రి రవి తదితరులను కలిశారు.

జాతీయ స్థాయి బాలికల ఖోఖో జట్టు కోచ్‌గా రూప



బీ.రూప

మక్తల్‌: రాష్ట్ర ఖేల్‌ ఇండియా సౌత్‌ జోన్‌ సబ్‌ జూనియర్స్‌ ఖోఖో జాతీయ స్థాయి బాలికల జట్టు కోచ్‌గా మండలంలోని కర్ని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల పీఈటీ బీ.రూప ఎంపికయ్యారు. హెచ్‌ఎం రఘువీర్‌కు ప్రొసిడింగ్‌ అందినట్లు అందిన్నట్లు శుక్రవారం ఆయన తెలిపారు. ఈ నెల 7 నుంచి 10వరకు తమిళనాడు రాష్ట్రంలో ఈ పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న డైరెక్టర్‌ రాంరెడ్డి

పాలమూరు: ఎస్‌వీఎస్‌ నర్సింగ్‌ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ చేపట్టారు. కళాశాల వద్ద ర్యాలీని ఎస్‌వీఎస్‌ రెసిడెన్షియల్‌ డైరెక్టర్‌ రాంరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. హౌసింగ్‌ బోర్డు కాలనీ మీదుగా ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎన్‌.లీనా మధుర మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్‌ లక్షణాలు, నివారణ పద్ధతులు, స్వీయ పరీక్షలు ఎలా చేసుకోవాలని అనే అంశంపై అవగాహన పెంచుకోవాలన్నారు. 40ఏళ్లు దాటిన మహిళలకు ఎస్‌వీఎస్‌లో మోమోగ్రామ్‌ పరీక్షలను చేస్తారని తెలిపారు. అనంతరం రొమ్ము క్యాన్సర్‌పై విద్యార్థులు అవగాహన కల్పించారు.

నేరాల నియంత్రణకే ప్రత్యేక తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పెబ్బేరు రూరల్‌: నేరాల నిర్మూలనకు వనపర్తి జిల్లాలో ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నామని వనపర్తి డీఎస్పీ ఆనంద్‌రెడ్డి తెలిపారు. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో నేరాలు నిర్మూలన, శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు నాగబందీ డీఎస్పీ చెప్పారు. ఈ సందర్భంగా 24 డ్రంకెన్‌ డ్రైవ్‌ కేసులు, పత్రాలు లేని 68 బైక్‌లు, నెంబరు ప్లేట్‌లేని బైక్‌లు 54, మొత్తం 122 వాహనాలపై కేసు నమోదు చేసి సీజ్‌ చేశామన్నారు. త్రిపుల్‌ రైడింగ్‌లో నలుగురికి, హెల్మెట్‌ లేకుండా డ్రైవ్‌ చేసిన 10 మందికి జరిమానా విధించామన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ.. అదుపులోకి తీసుకున్న వాహనాలను సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఒరిజినల్‌ పత్రాలు చూపించి తీసుకెళ్లాలని సూచించారు. ఊర్లలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు, నేరస్తులు వస్తే ఈ తనిఖీల్లో తెలుస్తుందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై నిత్యం తనిఖీ చేపట్టి చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే వెంటనే 100కు ఫోన్‌ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఇలాంటి తనిఖీల వల్ల నేరాల రేటు తగ్గుతుందని, ప్రజలు మరింత రక్షణ కల్పించవచ్చని పేర్కొన్నారు.

చైన్‌స్నాచర్‌ పట్టివేత

జడ్చర్ల: పట్టణంలోని సత్యనారాయణస్వామి దేవాలయ సమీపంలో యాదమ్మ మెడలోంచి బంగారు గొలుసు దొంగిలించేందుకు యత్నించిన శ్రవణ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రమేష్‌బాబు శుక్రవారం తెలియజేశారు. గురువారం రాత్రి దేవాలయం సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న యాదమ్మ మెడలోంచి గొలుసు దొంగిలించేందుకు యత్నించగా పెద్దగా కేకలు వేయటంతో చుట్టుపక్కల వారు గమనించి దొంగను పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారని, అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జూరాలకు 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి 7 గంటల వరకు ప్రాజెక్టుకు 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ఆవిరి రూపంలో 94, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, భీమా లిఫ్టు–1కు 650, కోయిల్‌సాగర్‌కు 315, ఎడమ కాల్వకు 1,250, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్‌ లింకు కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 900, భీమా లిఫ్టు –2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 9.214 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం నీటిమట్టం 1,020 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,250, సమాంతర కాల్వ ద్వారా 900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్‌ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 1,250, కుడి కాల్వ ద్వారా 10, ఎడమ కాల్వ ద్వారా 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమా ఫేజ్‌–2 ద్వారా 848, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

శ్రీశైలంలో 855.8 అడుగులు..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం 855.8 అడుగుల వద్ద 94 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డి పాడు ద్వారా వెయ్యి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,688, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 0.765 మిలియన్‌ యూనిట్లు ఉత్పత్తి చేసి 1,463 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 133 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

ఆత్మహత్యకు కారణమైన వారికి జైలుశిక్ష



శిక్ష పడిన ముగ్గురిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

శాంతినగర్‌: ఓ వ్యక్తిని మోసం చేసి ఆత్మహత్య చేసుకునేందుకు కారణమైన ముగ్గురికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష పడింది. వివరాల్లోకి వెళితే.. వడ్డేపల్లి మండలంలోని కోయిల్‌దిన్నెకు చెందిన కుర్వ చిన్న రంగస్వామి (42) శాంతినగర్‌ పట్టణంలో తిమ్మగురుడు ట్రేడర్స్‌, సీడ్స్‌ పేరుతో 2018లో దుకాణం నడిపేవాడు. వ్యాపారం బాగా సాగుతున్న క్రమంలో శాంతినగర్‌లో నివాసం ఉండే కార్తీక్‌, ప్రేమ్‌, కృష్ణవేణి, భాస్కర్‌ రూ.లక్షకు అదనంగా మరో రూ.లక్ష ఇస్తామని ఆశ చూపి రూ.15 లక్షల వరకు తీసుకున్నారు. వ్యాపారం గురించి అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందులు ఏర్పడటం వల్ల రంగస్వామికి ఇవ్వాల్సిన డబ్బులను తమ్ముడైన కుర్వ తిక్కయ్యతో కలిసి ఏప్రిల్‌ 18, 2014లో కర్నూల్‌కు వెళ్లారు. ఇస్తామన్న రూ.30 లక్షలు ఇవ్వాలని తనకు అప్పులు ఇచ్చిన వారి బాధలు ఎక్కువయ్యావని వేడుకున్నాడు. అందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రేమ్‌, కార్తీక్‌, కృష్ణవేణి మా దగ్గర డబ్బులు లేవని, ఇవ్వలేమని తిడుతూ అవమానపరిచారు. ఆవేదనతో ఇంటికి తిరిగి వచ్చిన రంగస్వామి దుకాణానికి వెళ్లాడు. రాత్రి ఎంతసేపైనా ఇంటికి రాకపోవడంతో గుమాస్తాకు ఫోన్‌ చేసిన తమ్ముడు తిక్కయ్య వివరాలు సేకరించాడు. దుకాణం మూసి ఉందని గుమాస్తా సమాధానం ఇస్తూ షాపు వెనుకకు వెళ్లి చూశాడు. దుకాణం వెనకాల వైపున ఉన్న రూములో బోల్టు పెట్టుకుని పడి ఉండడం గమనించాడు. తమ్ముడికి సమాచారం అందిన వెంటనే హుటాహుటిన శాంతినగర్‌కు చేరుకుని తలుపులు పగుల గొట్టారు. అప్పటికే పురుగు మందు తాగిన రంగస్వామి మృతి చెందాడు. ఈవిషయమై మృతుని తమ్ముడు తిక్కయ్య 2018 ఏప్రిల్‌19న శాంతినగర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శాంతినగర్‌ ఎస్‌ఐ మహేందర్‌ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. రంగస్వామి ఆత్మహత్యకు ముగ్గురు వ్యక్తులే కారణమని విచారణలో తేలడంతో ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం కేసు ట్రయల్‌ ఉండగా ఎస్పీ సృజన ఆదేశాలతో అదనపు ఎస్పీ రవి సూచనతో డీఎస్పీ వెంకటేశ్వర్లు, శాంతినగర్‌ సీఐ శివశంకర్‌గౌడ్‌లు సాక్షులను మోటివేట్‌ చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. ఇరువురి వాదనలు విన్న గద్వాల అడిషనల్‌ అసిస్టెంట్‌ సెషన్స్‌ జడ్జి ప్రభాకర్‌ నేరస్తులపై నేరం రుజువైందని సంజయ్‌ పటేల్‌ అలియాస్‌ కార్తీక్‌, హరిజన ప్రేమ్‌కుమార్‌, ఏ.కృష్ణవేణిలకు ఐదేళ్లపాటు కఠిన కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. తీర్పు వెలువడిన వెంటనే జడ్జి ఆదేశాల మేరకు నేరస్తులను పోలీసులు జైలుకు తరలించారు.

యథేచ్ఛగా ఎర్రమట్టి తవ్వకాలు

- అనుమతికి మించి తరలింపు
- అనుమతులున్నాయ్‌.. అంటూ ఇష్టారాజ్యం



మదనాపురం మండలంలోని ఎర్రగట్టు వద్ద మట్టి తవ్వకాలు

మదనాపురం: మండలంలో కొన్ని రోజులుగా ఎర్రమట్టిని ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. దుప్పల్లి, అజ్జకొల్లు, రామన్‌పాడు గ్రామాల్లో కొందరు ఇష్టారాజ్యంగా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మరికొందరు తూతూ మంత్రంగా రాయల్టీ చెల్లించి పెద్ద ఎత్తున టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు.

భారీ లోడ్‌లతో టిప్పర్లు

ఇదిలా ఉండగా మరోవైపు భారీ లోడుతో వెళ్లే టిప్పర్లతో తిరుమలాపల్లిలో ప్రధాన రహదారి దెబ్బతింటుంది. ప్రజలు రోడ్ల పైకి రావాలంటే భయపడుతున్నారు. అతివేగంతో వెళ్లడంతో ధుమ్ముతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ గుట్టలను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎర్రగట్టు నాశనం

మండలంలో ఎరగ్రట్టు నుంచి ఓ ప్రైవేట్‌ కాంట్రాక్టర్‌ రైల్వే పనికి 6వేల మెట్రిక్‌ టన్నుల ఎర్రమట్టి కోసం అనుమతి తీసుకున్నారు. అనుమతికి మించి ఎర్రమట్టి తరలించడంతో గుట్ట కరిగిపోతుందని స్థానికులు వాపోతున్నారు. పదేళ్లుగా ప్రభుత్వం ఈ గుట్టపై విత్తనాలు చల్లగా, అవి ప్రస్తుతం పెరుగుతున్నాయి. అడ్డగోలుగా తవ్వ కాలు చేయడంతో మొక్కలు ధ్వంసం అవుతున్నాయని రైతులు చెబుతున్నారు. అనుమతులు ఇచ్చి న అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా మట్టి తీసుకెళ్తున్నారు.

ఇప్పుడే బదిలీ అయ్యాను..

మట్టి తరలింపు విషయమై మైనింగ్‌ ఏడీ విజయరామరాజును వివరణ కోరగా.. తాను అరగంట ముందు బదిలీ అయ్యాను. నేను ఏమీ చెప్పలేను. ఇదే రాయండి అంటూ ఫోన్‌ కట్‌ చేశారు.

8న రగ్బీ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్‌ క్రీడలు: స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ అండర్‌–19 ఉమ్మడి జిల్లా బాల, బాలికల రగ్బీ జట్ల ఎంపికలను ఈనెల 8న ఉదయం 9 గంటలకు స్థానిక మెయిన్‌ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులు ఇంటర్‌ బోనఫైడ్‌, ఎస్‌ఎస్‌సీ జిరాక్స్‌తో హాజరుకావాలని కోరారు. వివరాల కోసం నిరంజన్‌రావు పీఈటీ 9441565382 ఫోన్‌ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అండర్‌–17 ఉమ్మడి రగ్బీ జట్ల ఎంపికలు

జిల్లా కేంద్రంలోని మెయిన్‌ స్టేడియంలో ఈనెల 8న ఎస్‌జీఎఫ్‌ అండర్‌–17 ఉమ్మడి జిల్లా బాల, బాలికల రగ్బీ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్‌బాబు ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు బోనఫైడ్‌, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో హాజరుకావాలని కోరారు.